
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 130 వ భాగం

## మత్స్యావతారం - 2

సత్యవ్రతుడు తన దోసిలిలోకి వచ్చిన చేపపిల్లని నీళ్ళలో వదిలితే తానిక్కడ ఉండడం క్షేమం కాదని, తనకి సహాయం చేయమని అడిగిందనీ క్రితం వ్యాసంలో చూసాం. ఇప్పుడీయన ఏం చేస్తాడో తెలుస్తుంది.

వ. అనిన విని కరుణాకరుండగు నవ్విభుండు మెల్లన య య్యంభశ్చర డింభకంబునుఁ గమండలు జలంబునం బెట్టి తన నెలవునకుం గొని పోయె, నదియు నొక్క రాత్రంబునం గుండిక నిండి తనకు నుండ నిమ్ము చాలక రాజన్యున కి ట్లనియె. [8-699]

చేప పిల్లని (యంభశ్చర ఢింభకంబు; అంభస్–నీరు, చర—తిరిగేది, డింభకంబు—పిల్ల), తన కమండలంలో ఉంచి తానుండే చోటికి తీసుకెళ్ళాడు. అయితే అది ఒక్కరాత్రిలో కమండలం, లేదా లోహపాత్ర (గుండిక) అంతా పెరిగింది. అందులో చోటు చాలక (తనకు నుండ నిమ్ము; తనకున్, ఉండన్, ఇమ్ము– చోటు) ఇలా అంది. తెలుగులో పోతన వాడిన అద్భుతమైన పదాలు గమనించారా?

క. ఉండ నిదిఁ గొంచె మెంతయు
నొండొకటిం దెమ్ము భూవరోత్తమ! యనుడున్
గండకముఁ దెచ్చి విడిచెను
మండలపతి సలిల కలశ మధ్యమున నృపా! [8-700]

రాజా (భూవరోత్తమా), ఈ కమండలం నేను ఉండడానికి సరిపోవడం లేదు, మరొక దానిలో ఉంచు. ఇలా అనేసరికి దాన్ని మరో పెద్ద కలశం (గండకము) లో ఉన్న నీటిలోకి (సలిల) మార్చాడు. మార్చినది ఎవరు? మండలపతి – భూమండలానికి రాజు. పోతన రాసిన వచనం కానీ పద్యాలుగానీ చదివితే అసలు ఈ పదాలు తెలుగేనా అనిపించడం సర్వసాధారణం. ఉదాహరణకి రాజు అనే దానికి పోతన వాడిన పదాలు – మండలపతి, భూవరుడు, నృపుడు (ఇది పరీక్షిత్తుని శుకమహర్షి ఉద్దేశించినది, కథ చెప్తున్నాడు కనక). వచ్చే పద్యాలలో మరోకొన్ని ఆశ్చర్యమైన పదాలు కూడా గమనించవచ్చు.

వ. అదియును ముహూర్తమాత్రంబునకు మూఁడు చేతుల నిడుపై యుదంచంబు నిండి పట్టు చాలక వేఱొండుఁ దె మ్మనవుడు నా రాచపట్టి కరుణాగుణంబునకు నాటపట్టుఁ గావున గండకంబు నొండొక్క చిఱుతమడుఁగున నునిచె; నదియు నా సరోవర జలంబునకు నగ్గలం బై తనకు సంచరింప నది గొంచెం బని పలికినం బుడమిఱేడు మంచి వాఁడగుటం జేసి యా కంచరంబు నుదంచిత జలాస్పదంబైన హ్రదంబునందు నిడియె; నదియు నా సలిలాశయంబునకును నధికంబై పెరుఁగ నిమ్ము చాలదని చెప్పికొనిన నప్పుణ్యుం డొప్పెడి నడవడిం దప్పని వాఁడైన కతంబున న మ్మహామీనంబును మహార్ణవంబున విడిచె; నదియును మకరాకరంబునం బడి రాజున కిట్లను "పెను మొసళ్ళు ముసరికొని కసిమసంగి మ్రింగెడి; నింతకాలంబు నడపి కడ పట దిగవిడువకు వెడలఁ దిగువు" మని యెలింగింప దెలిసి కడపట యన్నీటితిరుగుడు ప్రోడకుం బుడమిఱేఁ డిట్లనియె.

[8-701]

అయితే పెద్దపాత్రలో చేర్చిన మరో ముహూర్త కాలంలో (రోజులో 30వ వంతు లేదా 48 నిముషాలు, మరోవిధంగా ముహూర్త కాలం అంటే దాదాపు వెంఠనే) మూడు చేతులంత పెద్దదై 'ఇక్కడ కూడా చోటు చాలడంలేదు మరో పెద్ద పాత్ర తే' అని అడిగింది. రాజు కరుణకలవాడు (కరుణాగుణంబునకు నాటపట్టు గావున) కనక రాజు (రాచపట్టి) దాన్ని చిన్న మడుగులోకి చేర్చాడు. అలా మడుగులో ఉంచగానే అది ఆ సరోవరం అంతా నిండేటట్టు పెరిగి 'ఇక్కడ ఉండడానిక్కూడా చోటు చాలడంలేదు మరోచోటు చూపించు' అంది. రాజు (పుడమిఱేడు) సత్యవ్రతుడు మంచివాడు కనక ఆ చేపని (కంచరంబు) సరిపోయే మరో ఉచితమైన జలాశయంలోకి (హ్రదంబు) మార్చాడు. అక్కడ కూడా అది వెంఠనే పెరిగి చోటు చాలదు అనేసరికి, పుణ్యవ్రతుడు, నడవడి తప్పని సత్యవ్రతుడు ఇప్పటికి బాగా పెద్దదైన ఆ మహా మీనాన్ని సముద్రంలోకి (మహా, గొప్పదైన, ఆర్ణవము–నీటికి స్థానము) తీసుకెళ్ళాడు. అది సముద్రం (మకరాకరంబు – మొసళ్ళు ఉండే ఆకరము, చోటు) చేరగానే ఇలా అంది, 'ఈ సముద్రంలో మొసళ్ళు నన్ను తినేస్తాయి.

ఇప్పటివరకూ నన్ను కాపాడినవాడివి కనక ఇప్పుడు ఇలా వదిలేయకు సుమా!' ఇదంతా చూసి రాజు చేపతో (నీటితిరుగుడు ప్రోడ; నీటిలో తిరిగే వివేకి) ఇలా అన్నాడు.

మరోసారి ఈ వచనంలో తెలుగుపదాలు చూద్దాం. రాచపట్టి, హ్రదంబు, కంచరము, మహార్ణవము, మకరాకరంబు. అది అలా ఉంచి మరో సంగతి చూద్దాం. భగవంతుడు ఇలా చేప రూపంలో రావాలి అనుకున్నాడు. వెంటనే వచ్చేసి ఇదిగో నేను ఇలా వస్తున్నా అని చెప్పేయవచ్చుగా సత్యవ్రతుడితో? అలా కుదరదు ఈ సత్యవ్రతుడు ఇంతకాలం తపస్సు చేసినా మనసు చివర్లో మారుతుందేమో? భగవద్దర్శనానికి పెట్టే ఆఖరి పరీక్షలో తన కరుణ, సత్యవ్రతం, మంచితనం నిరూపించుకోగలడా? అది పరీక్ష చేయడానికే ఇదంతా జరిగిందని చెప్పుకోవాలి. ఆఖరికి ప్రహ్లాదుడి విషయంలో కూడా తండ్రి చేతిలో ఎన్ని కష్టాలు పడ్డా, భగవంతుడి మీద నమ్మకం కోల్పోకుండా ఉన్నాడా? లేదు అని పూర్తిగా నిరూపించాడు ప్రహ్లాదుడు 'కలడంబోధి...కలడాకాశంబునన్.. అంటూ చెప్పి, ఈ స్థంభంలో ఉన్నాడా అంటే, 'ఇందుగలడందులేడని..." అని నమ్మకంగా చెప్పాక అది పూర్తిగా నిజం అని చూపించడానికి భగవంతుడు కనిపిస్తాడు. ఇంతకీ బ్రహ్మం ఉండేది ఎక్కడ? దానికి శివానందుల సమాధానం చూసాం ముందు వ్యాసాల్లో. పంచమహావాక్యాలు చెప్పేది కూడా అదే, ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి. ఇంకా స్థూలంగా చెప్పాలంటే ఈ ప్రపంచంలో అణువణువూ ఆ పరబ్రహ్మం తప్ప మరొకటి లేదు. అందుకే ఇదంతా రాజుకి పరీక్ష. ఇంత జరిగాక సత్యవ్రతుడికి తెల్సింది. ఆయన ఇలా అంటున్నాడు చేపతో.

సీ. ఒక దినంబున శతయోజనమాత్రము
విస్తరించెదు నీవు; వినము చూడ
మిటువంటి ఝషముల నెన్నఁడు నెఱుఁగము
మీనజాతుల కిట్టి మేను గలదె?
యేమిటి కెవ్వఁడ? వీ లీలఁ ద్రిప్పెదు
కరుణ నాపన్నులఁ గావ వేఁడి
యంభశ్చరంబైన హరివి నే నెఱిఁగితి
నవ్యయ! నారాయణాభిధాన! [8-702]

తే. జనన సంస్థితి సంహార చతురచిత్త!

దీనులకు భక్తులకు మాకు దిక్కు నీవ;
నీదు లీలావతారముల్ నిఖిలభూత
భూతి హేతువుల్ మ్రొక్కెదఁ బురుషవర్య! [8-702.1]

ఈ పద్యం అతి సులభంగా అర్థమయ్యేదే. ఒక్కరోజులో వంద యోజనాలు పెరిగావు. నేనెప్పుడూ కూడా ఇలా పెరిగే నీటిచరాలు, చేపలు (ఝషము) ఉన్నట్టు వినలేదు, కనలేదు. అసలు చేపలకి ఇలాంటి శరీరం ఉంటుందా? నువ్వు ఎవరివో, నన్ను ఈ విధంగా తిప్పుతున్నావు కనక ఈ లీల చూసి కరుణతో దీనులని (ఆపన్నులని) కాపాడానికి నువ్వు చేపగా (యంభశ్చరంబైన) అవతరించిన అవ్యయుడివైన భగవంతుడివే అని తెలుసుకున్నాను. నీ లీలావతారాలు అన్ని జీవులకీ మేలు (భూతి హేతువులు) కలిగిస్తాయి. పురుషోత్తముడవైన (పురుషవర్య) నీకు మొక్కుతున్నాను. ఇలా మీనరూపం ధరించడానికి కారణం ఏమిటి?

వ. అని పలుకు సత్యవ్రత మహారాజునకు నయ్యుగంబు కడపటఁ బ్రళయ వేళ సముద్రంబున నేకాంతజన ప్రీతుండయి విహరింప నిచ్ఛించి మీన రూపధరుండైన హరి యిట్లనియె. [8-705]

సీ. ఇటమీఁద నీ రాత్రికేడవదినమున
బద్మగర్భున కొక్క పగలు నిండు;
భూర్భువాదిక జగంబులు మూఁడు విలయాబ్ధి
లోన మునుంగు; నాలోనఁ బెద్ద
నావ చేరఁగ వచ్చు; నా పంపు పెంపున
దానిపై నోషధితతులు బీజ
రాసులు నిడి పయోరాశిలో విహరింప
గలవు సప్తర్షులుఁ గలసి తిరుఁగ [8-706]

ఆ. మ్రోలఁ గాన రాక ముంచు పెంజీఁకటి
మిడుకుచుండు మునుల మేనివెలుఁగుఁ
దొలకుచుండు జలధి దోధూయమాన మై

నావ దేలుచుండు నరవరేణ్య! [8-706.1]

దీనికి చేపరూపంలో (మీన రూపధరుండైన) ఉన్న శ్రీహరి ఇలా చెప్పాడు. ఈ రోజుకు ఏడవ రోజున కల్పాంతం జరగబోతోంది. బ్రహ్మకి (పద్మగర్భుడు-పద్మంలో జనించినవాడు) ఒక పగలు గడిచి నిద్రలోకి జారుకుంటాడు. భూర్భువాదిక జగంబులు మూఁడు (భూః-భూమి, భువః-పాతాళం, సువః-స్వర్గలోకం) విలయానికి లోనై మునిగిపోతాయి. అందులో వచ్చే ఒక నావలో ఓషధులు, విత్తనాలు (బీజ), సప్తర్షులని చేర్చి నా ఆనతితో (నా పెంపున) సంచరించండి. ముందు ఉన్నది కూడా కనిపించనంత చీకటిలో మునుల దేహంలో ఉండే వెలుగుతో నావ ఊగుతూ తూగుతూ (దోధూయమానమై) తేలుతూ ఉంటుంది. ఈ మునుల వెలుగు గురించి మరో సారి గుర్తు తెచ్చుకుందాం పురంజనోపాఖ్యానంలో చెప్పుకున్నదే. ఈ వెలుగు సూక్ష్మ శరీరం అనీ కర్మలు దానితో పాటు మరో స్థూల శరీరంలోకి చేరుకుంటాయనీ, ధ్యానం చేసేవారిలో మిక్కుటంగా కనిపించే తేజస్సు అనీ చెప్పుకున్నాం. ఇదే ధర్మం, బ్రహ్మం, మనలో ఉండే ఆత్మ లేదా అవతలి/అందరి వారిలో ఉండే పర-ఆత్మ – లేదా పరమాత్మ. ఎప్పుడైతే ఆత్మ దర్శనం అయిందో అప్పుడే పరమాత్మ దర్శనం.

వ. మఱియు నన్నావ మున్నీటి కరళ్ళకు లోనుఁ గాకుండ, నిరుఁ గెలంకుల వెనుక ముందట నేమఱకుండఁ, బెన్నెఱుఁలగు నా గఱులన్ జడియుచుఁ బొడువ వచ్చిన బలుగ్రాహంబుల నొడియుచు సంచరించెద; నొక్క పెనుఁబాము చేరువ నా యనుమతిం బొడచూపెడు దానంజేసి సుడిగాడ్పుల కతంబున నావ వడిం దిరుగంబడకుండ నా కొమ్ము తుదిం పదిలము చేసి నీకునుఁ దపసులకును నలజడి చెందకుండ మున్నీట నిప్పాటం దమ్మిచూలి రేయి వేగునంతకు మెలంగెద; నది కారణంబుగా జలచర రూపంబుఁ గయికొంటి; మఱియు నొక ప్రయోజనంబుఁ గలదు; నా మహిమ పరబ్రహ్మం బని తెలియుము; నిన్ను ననుగ్రహించితి"నని సత్యవ్రతుండు చూడ హరి తిరోహితుం డయ్యె; నయ్యవసరంబున.

[8-707]

నావ తిరగబడిపోకుండా ఉండడానికి నా ఆజ్ఞతో ఒక పెద్ద పాము (వాసుకి) వస్తుంది. దాంతో నావని నా కొమ్ముకి కడితే చాలు. ఆ నావ బ్రహ్మ (దమ్మిచూలి) మరోసారి రాత్రి గడిచేవరకూ (రేయి వేగునంతకు) సాగుతుంది. ఇలా నీ దగ్గిరకి రావడానికి మరో కారణం ఏమిటంటే నిన్ను అనుగ్రహించాను అని సముద్రంలోకి వెళ్ళిపోయాడు. ఈ భగవంతుడి అనుగ్రహం గురించి ముందు చెప్పుకున్నదే – పెట్టిన పరీక్షలో సత్యవ్రతుడు తానేమిటో నిరూపించుకున్నాడు కదా. కల్పాంతం కథ వచ్చే వ్యాసంలో

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS